సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 24 । మార్చి । 2025



నివాళి.. పరామర్శ

పులివెందులలో కన్నుమూసిన చవ్వా విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీ సమేతంగా సందర్శించి నివాళులర్పించారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ॥ (సా॥)	సహర్ మంగళ॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.55
రాజంపేట	6.29	5.03
పీలేరు	6.30	4.54
మదనపల్లె	6.32	4.56

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 124 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దెబ్బతిన్న అరటితోటలను నేడు వైఎస్ జగన్ పరిశీలన



పులివెందుల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 8.30 గంటలకు పులివెందుల నివాసం నుంచి బయలుదేరి లింగాల మండలంలో అరటి తోటలను పరిశీలిస్తారు. తాజాగా తీవ్ర ఈదురుగాలులతో లింగాల మండలంలో వేల ఎకరాలలో పంట నష్టం జరిగింది. నష్టపోయిన అరటి రైతులతో మాట్లాడతారు. అనంతరం వేంపల్లెలో జెడ్పీటీసీ రవి నివాసంలో జరిగే శుభకార్యానికి హాజరవుతారు. తర్వాత ఇడుపులపాయ చేరుకుని అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం తాడేపల్లి చేరుకుంటారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నేడు గోవిందమాంబ ఆరాధన మహోత్సవం

బ్రహ్మంగారిమఠం: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేయనున్నారు.

నేడు రాయచోటిలో ర్యాలీ

రాయచోటి అర్బన్: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, అదనపు డీఎంహెచ్ఓ, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారిణి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజి సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగుతుందన్నారు. అనంతరం ఎన్‌జీఓ సభాభవనంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఏడాది నిర్వహించిన టీబీ నివారణ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, టీబీ ముక్తభారత్‌లో ఎంపికైన పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

29న నాటక ప్రదర్శనలు

రాజంపేట టౌన్: అన్నమయ్య 522వ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ రాత్రి 7 గంటల నుంచి తాళ్లపాక ధ్యానమందిరం ఆవరణలో ఉచితంగా నాటకాలను ప్రదర్శించనున్నారు. ఈ విషయాన్ని అన్నమయ్య కళాకారుల ఐక్యవేదిక రాజంపేట అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నాటకాల ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా శ్రీరామాంజనేయ యుద్ధసీను, శ్రీకృష్ణరాయబారంలోని మయసభ సన్నివేశం, పడక సీను, కర్ణసందేశం, బాలనాగమ్మ నాటకంలోని సన్నివేశాలను ప్రముఖ కళాకారులు ప్రదర్శిస్తారని చెప్పారు.



అన్నదాత దు:ఖీభవ!

- రూ.20వేలు సాయంపై మాట తప్పిన కూటమి ప్రభుత్వం
- సాగు పెట్టుబడి కోసం ఇళ్లలోని పసిడి బ్యాంకుల్లోకి..
- 2024–25లో సేద్యానికి బ్యాంకులు ఇచ్చిన రుణాలు 9,741 కోట్లు
- అందులో బంగారంపై రూ.2,900 కోట్ల రుణం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిరైతుకు 'భరోసా'



బి.కొత్తకోట: వ్యవసాయ రైతుల కుటుంబాల్లో ఉండాల్సిన బంగారం బ్యాంకు లాకర్లలోకి చేరుతోంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు నూటికి 90 శాతం ఉన్నాయి. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీల భారం మోయలేని వారు బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేసిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో రైతులకు పెద్దమొత్తంలో రుణాలు అందినట్టు లెక్కలు చెబుతున్నా..అందులో బంగారంపై ఇచ్చిన రుణాలు వందల కోట్లలో ఉన్నాయి.

రెన్యూవల్ రుణాలే..

జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా వార్షిక రుణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. వివిధ రంగాలు, వ్యవసాయం, ప్రాధాన్యత రంగాలకు కలిపి రూ.13,720 కోట్ల రుణాలు అందించాలన్నది ప్రణాళిక. ఇందులో వ్యవసాయానికి రూ.10,098 కోట్ల రుణాలను జిల్లాలోని 239 బ్యాంకుల నుంచి రైతులకు అందించాలని నిర్ణయించారు. ఇందులో గత డిసెంబర్ నాటికే రూ.9,741 కోట్ల రుణాలను రైతులకు మంజూరు చేసినట్టు ఎల్‌డీఎం ఆంజనేయులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం, దాని అనుబంధ పంటలు సాగు చేసిన 8,68,490 మంది రైతులకు (ఇందులో వ్యసాయానికి సంబంధించి కింద 6,43,295 మంది రైతులు) రుణాలు ఇచ్చినట్టు అధికారిక లెక్క. అయితే ఈ లెక్కల్లో 90శాతం మేరకు బ్యాంకులు ఇప్పటికే ఇచ్చిన రుణాలను మళ్లీ రెన్యూవల్ చేసి వాటికే రుణాలు ఇచ్చినట్టుగా లెక్కలు వేశారు. మిగతా రంగాలకు సంబంధించి రూ.11.739 కోట్ల రుణాల మంజూరుకు రూ.10,929 కోట్లు మంజూరు చేసి 93శాతం లక్ష్యం సాధించామని లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ అధికారులు లెక్కలు చెబుతున్నారు.

ఇళ్లలోని పసిడి బ్యాంకులకు..

రుణాలు పొందేందుకు రైతులు బంగారాన్ని తాకట్టు పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకునే విషయంలో ముందుంది. ఏటా కేంద్రవాటా రూ.6,500, రాష్ట్రప్రభుత్వ వాటాగా రూ.7,500 కలిపి రూ.13,500 చెల్లించింది. దీనివల్ల రైతులకు పంటల సాగు సమయంలో పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడేవి. రైతన్నకు చేదోడుగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం అందించలేదు. అప్పులు పుట్టక రైతులు ఇళ్లలోని బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెడుతున్నారు. గడచిన ఏడాది రుణప్రణాళికలో వేసిన లెక్కల్లో 30శాతం రుణం బంగారంపై తాకట్టుతో ఇచ్చినట్టు లెక్కలు వేశారు. అంటే వ్యవసాయానికి బ్యాంకులు ఇచ్చిన రూ.9,741 కోట్ల రుణాల్లో బంగారంపై ఇచ్చినది రూ.2,900 కోట్లు అని అంచనా.

రూ.406 కోట్లు ఎగ్గొట్టిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సహాయం అందాలి. 2024–25లో ఈ పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు ప్రభుత్వం నుంచి పొందాల్సిన సాయాన్ని నష్టపోయారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే రూ.6,500 వాటా సొమ్ము పక్కనపెట్టి రాష్ట్ర వాటా రూ.13,500 ఇచ్చినా జిల్లా రైతాంగానికి రూ.406.74 కోట్ల ఆర్థిక సహాయం అందాలి. 2023–24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన రైతుభరోసా రైతుల సంఖ్య మేరకు పై సహాయం అందాలి. తాజా లెక్కలను పరిగణలోకి తీసుకుంటే రైతుల సంఖ్య పెరగడంతోపాటు అన్నదాత సుఖీభవ సాయం కూడా పెరుగుతుంది.

జగన్ పాలనలో రైతు భరోసా (కోట్లలో)

ఏడాది	రైతులసంఖ్య	చెల్లింపు
2019–20	1,96,010	రూ.147.00
2020–21	2,05,716	రూ.154.28
2021–22	2,04,133	రూ.153.09
2022–23	1,98,957	రూ.149.21
2023–24	2,03,374	రూ.152.53

2019-24 మధ్యలో
రైతుభరోసా రైతులు: 10,08,190
మొత్తం సాయం: రూ.1,361 కోట్లు
రాష్ట్ర వాటా: రూ.756,14,25,000
కేంద్ర వాటా: రూ.604,91,40,000
2024-25లో: 0 (సున్నా)

రూ.లక్షన్నర రుణం



ఎకరా టమాట సాగుకు పెట్టుబడి సొమ్ము లేకపోవడంతో గ్రామీణ బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి లక్షన్నర రుణం తీసుకున్నా. ఇప్పుడు టమాటకు ధరలేక నష్టపోతున్నాం. ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ నగదు ఇంకా అందలేదు.త్వరగా అందించాలి -బాబు, కందుకూరు, పీటీఎం మండలం

సుఖీభవ రాలేదు



రెండెకరాల్లో పంటలు సాగు చేసేందుకు ఎస్‌బీఐ నుంచి రూ.2 లక్షల రుణం కోసం బంగారం తాకట్టు పెట్టాను. అన్నదాత సుఖీభవ సాయం అందలేదు. గత ప్రభుత్వం ఈ సమయానికి రూ.5,500 సాయం ఖాతాకు చెల్లించింది. -ఎం.గోపాల్‌రెడ్డి, అంగళ్లు, కురబలకోట మండలం

హార్సిలీహిల్స్‌లో వెలగని లైట్లపై సబ్ కలెక్టర్ సీరియస్

- తక్షణమే చర్యలకు ఆదేశం



హార్సిలీహిల్స్‌పై హైమాస్ లైట్లు పరిశీలిస్తున్న ఎల్ఐ, కాంట్రాక్టర్

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్‌పై వెలగని లైట్ల విషయమై మదనపల్లె సబ్‌కలెక్టర్, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ మేఘస్వరూప్ సీరియస్ అయ్యారు.దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. 'హార్సిలీహిల్స్‌కు వెలుగులు ఎప్పుడు' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనంపై సబ్ కలెక్టర్ స్పందించారు. విద్యుత్‌శాఖ సిబ్బందితో మాట్లాడిన సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బంది అసలు సమస్య ఎక్కడున్నది ఆరా తీశారు. దీనిపై విద్యుత్ శాఖ, కాంట్రాక్టర్ హార్సిలీహిల్స్‌కు పరుగులు తీశారు. టెండర్‌లో హైమాస్ లైట్లు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ వాటి నిర్వహణ బాధ్యతలు చూడాలన్న నిబంధన ఉంది. సబ్ కలెక్టర్ ఆదేశాలతో కొండపై ఐదుచోట్ల ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను పరిశీలించారు. వాటికి స్విచ్ బోర్డులు ధ్వంసం కావడం, సరైన విద్యుత్ సరఫరా వైర్లు లేకపోవడం, పైన అమర్చిన లైట్లు పగిలిపోవడం లేదా కాలిపోవడాన్ని గుర్తించారు. మెయిన్ స్విచ్‌లు మార్చాలని, కంట్రోల్ ప్యానళ్లు అమర్చాలని గుర్తించారు. గాలిబండలపై రెండు, గుడి వద్ద ఒకటి హైమాస్ లైట్లు వెలగకపోవడానికి ఇవే కారణమని నిర్ధారించారు. అలాగే ఒకదానికి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని లైన్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి చెప్పారు. అంధకారంలో ఉంటున్నామని, రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని పర్యాటకులు, స్థానికులు చెప్పారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లాస్.. తుస్

- పత్తాలేని తరగతులు
- నీరుగారుతున్న లక్ష్యం
- జిల్లాలో నిరక్షరాస్యులుగా గుర్తించిన మహిళలు 13,767 మంది

పెద్దతిప్పసముద్రం: ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు, గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్య మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉల్లాస్ కార్యక్రమం నామమాత్రానికే పరిమితమైంది. మహిళలకు తరగతులు సైతం సక్రమంగా నిర్వహించకపోడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ కార్యక్రమం ఆదిలోనే హంసపాదు అన్న చందంగా తయారైంది. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ కార్యక్రమాన్ని అధికారులు లాంఛనంగా ప్రారంభించి అనంతరం చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆశయాలు ఘనం.. ఆచరణ శూన్యం

పొదుపు సంఘాలు, పాఠశాలల్లో వంట పని చేసే మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించి రాత్రి పూట రెండు గంటల పాటు చదవడం, రాయడం లాంటి అభ్యసనా తరగతులు నిర్వహించాలనేది ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.జిల్లాలోని ప్రతి మండలం నుంచి వెయ్యి మంది మహిళలను గుర్తించాలి. వీరికి బోధించేందుకు ప్రతి మందిలో ఒకరు చొప్పున సంఘంలో విద్యావంతులైన ఒక స్వచ్ఛంద శిక్షకురాలిని నియమించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ సముదాయాల్లో రెండు గంటల పాటు తరగతులు నిర్వహించాలి. ఇందుకోసం ప్రభుత్వం అభ్యసనా సామగ్రిని అందజేసినా గ్రామాల్లో తరగతులు నామమాత్రంగానే సాగినట్లు తెలుస్తోంది. మహిళలందరినీ విద్యావంతులను చేయాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు గాలికొదిలేయడంతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు.



పెద్దతిప్పసముద్రంలో పరీక్షలు రాస్తున్న మహిళలు

పరీక్షలు కూడా అంతంత మాత్రమే..

నిరక్షరాస్యులుగా నమోదైన మహిళలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా ఈ నెల 23న ప్రాథమిక అక్షరాస్యత పరీక్షలు నిర్వహించినా పలు చోట్ల నామమాత్రంగానే జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో కొన్ని చోట్ల అయితే కేవలం ఫొటోల ఫోజుల కోసం మహిళలను కూర్చోబెట్టి ఉన్నతాధికారుల సెల్‌ఫోన్లకు సమాచారం చేరవేసి వెళ్లిపోయినట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్ని చోట్ల పరీక్షలు నిర్వహించినా మహిళలకు ఏం రాయాలో, ఎలా రాయాలో తెలియక అయోమయానికి గురైనట్లు తెలుస్తోంది. అభ్యసనా తరగతులే జరగలేదని, తమకు పుస్తకాలు కూడా ఇవ్వలేదని పరీక్షలు ఎలా రాసేదని పలువురు మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించాం

జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 13,767 మంది మహిళలను నిరక్షరాస్యులుగా గుర్తించాం. వారికి తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఏపీఎంల ఆధ్వర్యంలో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 13,484 మంది పరీక్షలు రాశారు. తన పరిధిలోని ఆరు మండలాల్లో ఆదివారం జరిగిన పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ఫొటోలు కూడా ఉన్నతాధికారులకు అప్‌లోడ్ చేశాం -రాజ, వయోజన విద్య సూపర్‌వైజర్, అన్నమయ్య జిల్లా

క్షయమే లక్ష్యం!



పౌష్టికాహారం అందిస్తున్న మదనపల్లె ఎన్‌టీఈపీ సిబ్బంది (ఫైల్‌ఫొటో)

- అవగాహనతో అరికడదాం
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం



మదనపల్లె సిటీ: దేశంలో దీర్ఘకాలిక రోగాలలో ప్రధానమైనది క్షయ. ఇది అంటు వ్యాధి. మైకో బాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించినది అయినా చర్మం నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వ్యాపిస్తుంది. ఆరోగ్యకార్యకర్తలు రోగుల ఇళ్లకు వెళ్లి వారితో మందులను వేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నయమవుతోంది. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం....

- ఒకప్పుడు క్షయ అంటే హడలిపోయేవారు. వ్యాధి పడిన రోగిని చూస్తే అల్లంత దూరానికి వెళ్లేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. క్షయ బాధితులు ఎంచక్కా దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి, డీఎంసీకి వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. తొలిదశలోనే ప్రభుత్వం అందిస్తున్న మందులు, మాత్రలు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు.
- జిల్లాలో మదనపల్లె అర్బన్, రూరల్, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, నందలూరు, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె, వాల్మీకిపురంలో టీబీ కేంద్రాలు ఉన్నాయి. 71 డిఎంసీలు,ట్రూనాట్ మిషన్లు 29, సీబీనాట్ మిషన్ ఒకటి ఉన్నాయి.

ఆధునిక నిర్ధారణ పరీక్షలు

జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధి నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్ష పరికరాలను పంపింది. జిల్లాలో తొమ్మిది టీబీ యూనిట్లు ఉన్నాయి. ఇందులో సీబీ న్యాట్ మిషన్లతో పాటు ఆర్‌టీపీసీఆర్ పరికరాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గళ్లలో టీబీ క్రిములు అతి తక్కువ సంఖ్యలో ఉన్నా కూడా వాటిని గుర్తించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. దీంతో పాటు ఎక్స్‌ట్రా పలమనరీ కేసులు ఎక్స్‌రే ద్వారా కూడా టీబీని గుర్తించడం జరుగుతుంది.

వ్యాధి గుర్తింపు.. లక్షణాలు

- రెండు వారాలకు మించి దగ్గు ఉండటం
- రాత్రి పూట ఎక్కువగా జ్వరం రావడం
- ఛాతిలో నొప్పి రావడం, బరువు తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- పుట్టిన బిడ్డకు వెంటనే బీసీజీ టీకా అందించాలి

దగ్గువచ్చినప్పుడు నోటికి అడ్డంగా ఏదైనా గుడ్డ అడ్డం పెట్టుకోవాలి.

- వ్యాధి సంక్రమించిన వ్యక్తి నిర్దేశించిన సమయం వరకూ మందులు వాడాలి.
- వ్యాధి సోకిన వ్యక్తి కుటుంబ సభ్యులందరికి పరీక్షలు నిర్వహించాలి.

సంవత్సరం	పరీక్షలు చేసిన సంఖ్య	టీబీ పాజిటివ్ కేసులు
2022	28,136 మంది	3,040
2023	39,869 మంది	2,703
2024	64,273 మంది	2,399
2025	12524 మంది	547

టీబీ రోగులకు పౌష్టికాహారం: క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దే దిశగా చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా టీబీ చికిత్స పొందుతున్న వారికి జిల్లాలో 534 మంది ని-క్షయ్ మిత్ర ద్వారా 512 మందికి పౌష్టికాహారం అందజేశారు. నిక్షయ పోషణ యోజన కింద 2024 సంవత్సరంలో 496 మందికి రూ.57,93,000 నగదు అందజేశారు.

విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం



2027 నాటికి టీబీ అంతం చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. జిల్లాలోని ప్రతి పిహెచ్‌సి పరిధిలో యాక్టివ్ కేసు ఫైండింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నాం. రెండు వారాల పాటు జ్వరం, దగ్గు, రాత్రి వేళల్లో చెమట ఉన్న వారికి కళ్లె పరీక్షలు చేస్తున్నాం. పరీక్షల్లో పాజిటివ్ వస్తే ఆరు నెలల పాటు మందులు వాడిస్తున్నాం. అన్ని పీహెచ్‌సీల్లో కళ్లె పరీక్షలుల చేస్తున్నారు. -డాక్టర్ శైలజ, టీబీ నివారణ అధికారిణి, అన్నమయ్య జిల్లా.

రామా.. సామాన్యుల బాధ కనుమా!

- వచ్చే నెల 11న రాములోరి కల్యాణం
- సామాన్య భక్తులకు కనిపించని భాగ్యం
- టీటీడీకి సవాల్‌గా మారనున్న పరిస్థితి

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆలయం ఒంటిమిట్ట కోదండ రామాలయం. ఇక్కడ ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో అత్యంత కీలకఘట్టం ఏప్రిల్ 11న జరిగే దాశరథి కల్యాణం. కల్యాణం కనులారా తిలకించే భాగ్యం సామాన్య భక్తులకు దరిచేరేలా ఉంటుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో టీటీడీ ఎలా వ్యవహరిస్తుందనేది వేచిచూడాల్సిందే.

వీవీఐపీ, వీఐపీలకే పెద్దపీట వేసే క్రమంలో..

కల్యాణ వీక్షణకు వీవీఐపీ, వీఐపీలకు పెద్దపీట వేసే క్రమంలో సామాన్య భక్తులను దూరం చేస్తోందన్న అపవాదును టీటీడీ మూటకట్టుకోవాల్సి వస్తుంది. సామాన్య భక్తులు కూడా కనులారా వీక్షించే సౌకర్యం కల్పించాలని వినతులు వస్తున్నాయి. కనీసం కల్యాణం తర్వాత ఉత్సవ మూర్తులను దగ్గరగా దర్శించుకునే భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

- సామాన్య భక్తుల గ్యాలరీలు ఉన్నప్పటికీ, అవి కల్యాణ వేదికకు చాలా దూరంగా ఉంటాయి. కాబట్టి ఎల్‌ఈడీ స్క్రీన్‌లో మాత్రమే చూడాల్సి వస్తోంది. కేవలం కల్యాణ వేదికలో ఉన్నామన్న భావనతో ఉండాల్సి వస్తోంది. ఈ సారి 60 గ్యాలరీలు ఏర్పాటు చేయాలనే భావనలో టీటీడీ ఉన్నట్లు సమాచారం. భక్తులు మధ్యాహ్నం 2 నుంచి గ్యాలరీకి చేరుకుంటారు. ఈ ఏడాది భానుడి ప్రతాపం అధికంగా ఉంటోంది. కాబట్టి సౌకర్యాల కల్పనలో ఎలాంటి తప్పిదాలు తలెత్తినా.. టీటీడీ మరోసారి నిందలు మోయాల్సి వస్తుంది.



సీతారామలక్ష్మణ మూలవిరాట్‌లు

ప్రసాదాల కోసం పడరాని పాట్లు

రాములోరి కల్యాణం వీక్షించేందుకు వచ్చే సామాన్య భక్తులకు టీటీడీ అందజేసే ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాల విషయంలో ఎప్పుడూ తోపులాటలు జరుగుతున్నాయి. ఇలాంటివి చోటు చేసుకోకుండా ఉండేందుకు.. టీటీడీ గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది. తిరుమల శ్రీవారి లడ్డూలు రెండు (25 గ్రాములు) ఇచ్చేందుకు టీటీడీ యోచిస్తున్నట్లు తెలిసింది. పంపిణీ కౌంటర్ల విషయంలో గందరగోళం లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు. గతంలో కన్నా అధిక సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేసే యోచనలో టీటీడీ నిమగ్నం కావాలి. అలా చేస్తే.. సామాన్య భక్తులు ఇబ్బందులు పడకుండా ఉంటారు.

సర్వాంగ సుందరంగా..

కల్యాణ వేదికను పుష్పాలు, ఫలాలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు టీటీడీ సన్నద్ధమవుతోంది. ఈ మేరకు ఉద్యానవన విభాగానికి ఆ బాధ్యతలను అప్పగించనున్నారు. అందుకు సంబంధించి సన్నద్ధం కావాలని టీటీడీ ఆదేశించినట్లు సమాచారం. కడప–రేణిగుంట జాతీయ రహదారి పక్కన విశాలమైన ఖాళీ స్థలంలో రూ.40 లక్షలతో ప్రధాన కల్యాణ వేదిక నిర్మించారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి శాశ్వత పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రూ.45 కోట్లతో కలశం ఆకృతితో నిర్మాణాలు చేపట్టాలని టీటీడీ నిర్ణయించింది. తొలివిడతలో రూ.17 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కల్యాణవేదిక రహదారి, ముఖద్వారాలు, జాంబవంతుని విగ్రహం, పలు సౌకర్యాలకు రూ.28 కోట్లకు పైగా వ్యయం చేశారు.



కలశం ఆకృతిలో రాములోరి కల్యాణ వేదిక

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


సురేంద్ర(ఫైల్)

మదనపల్లె : వ్యక్తి అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీ షావలీ తెలిపారు. పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన సురేంద్ర (44) స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా తిరుపతి పండ్ల మండీలో నగదు రావాల్సి ఉండగా మండీ యజమానులు నగదు ఇస్తామని చెప్పడంతో అదే విషయం ఇంట్లో చెప్పి ఈనెల 19న ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. పలుచోట్ల కుటుంబ సభ్యులు, భార్య గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం సురేంద్ర భార్య భాగ్యలక్ష్మి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న హరిప్రసాద్

గాలివీడు : గల్ఫ్ దేశానికి వెళ్లొద్దన్నారని మనస్థాపంతో బూజెల హరిప్రసాద్(53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాలివీడు పట్టణంలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన బూజెల లక్ష్మన్న కుమారుడు హరిప్రసాద్ పలుమార్లు కువైట్ కు వెళ్లి వచ్చాడు. అయితే గత సంవత్సరం ఇండియాకు వచ్చిన హరిప్రసాద్ మళ్లీ కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అందుకు కుటుంబ సభ్యులు వద్దని అడ్డు చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం గాలివీడు మండలం పక్కీరారెడ్డిగారిపల్లెలో నివాసం ఉంటున్న మేనల్లుడు ఎద్దుల ఈశ్వర్ ఇంటికి వచ్చిన హరిప్రసాద్ మనస్థాపంతో మద్యంలో విష ద్రావణం కలుపుకుని తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న హరిప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పల్లెపల్లెల్లో బెల్టు షాపులు


రెడ్డిపల్లి మద్యం దుకాణం వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన గదులు

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉంది. ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. వాటిని అమలు చేయాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. పుల్లంపేట మండలంలో మూడు మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే ప్రతి గ్రామంలో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం బాటిళ్లపై రూ. 10 నుంచి రూ. 20లు వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా రెడ్డిపల్లి మద్యం దుకాణం వద్ద అనధికారికంగా పర్మిట్ రూములు ఏర్పాటు చేయడం వల్ల మద్యం ప్రియులు యథేచ్ఛగా మద్యం తాగుతున్నారు. కూలి నాలి చేసుకునే వారు మద్యానికి బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో బెల్టు షాపులు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నివాళి.. పరామర్శ

పులివెందులలో కన్నుమూసిన పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీ సమేతంగా సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు పలువురు నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


చవ్వా విజయశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ భారతి


చవ్వా విజయశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ సునీతారెడ్డిని పరామర్శిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు


అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్


వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలి వచ్చిన అభిమానులు


వైఎస్ జగన్‌తో వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

చవ్వా విజయశేఖర్‌రెడ్డి నేత్రదానం


విజయశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని చవ్వా సుభాకర్ రెడ్డి కాలనీకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చవ్వా విజయ శేఖర్ రెడ్డి ఆదివారం మరణించడంతో ఆయన నేత్రాలను దానం చేశారు. భార్య సునీత, కుమారుడు దుష్యంత్ రెడ్డి, కుమార్తె మధులిక, చెల్లెలు ప్రమీలమ్మ, బావ వైఎస్ మనోహర్ రెడ్డి, వదిన సులోచనమ్మలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారమిచ్చారు. నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని స్వగృహానికి వెళ్లి భౌతికకాయం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధపడుతూ ఈ లోకాన్ని చూడలేని అంధులకు చూపు ఇచ్చినవారమవుతామన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు, బంధువులెవరైనా మరణిస్తే నేత్రదానం కోసం 9866727534, 7093204537 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రేమ వివాహం చేసుకున్నారని యువకుడి ఇంటిపై దాడి

- దాడిలో గాయపడిన యువకుడి తల్లిదండ్రులు, అక్కా, బావ
- పోలీసులు కేసు నమోదు చేయలేదని బాధితుల ఆవేదన


వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేయడంతో పగిలిపోయిన తలుపులు, కిటికీలు

లక్కిరెడ్డిపల్లి : తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్నారనే కారణంగా సోమల వెంకటేశ్వర్లు అనే యువకుడి ఇంటిపై టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యులు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఇంట్లో ఉన్న యువకుడి తల్లిదండ్రులు వెంకటలక్షుమ్మ, వెంకటరమణ, అక్కా, బావలను చితకబాదారు. ఈ ఘటన లక్కిరెడ్డిపల్లి మండలం మద్దిరేవుల గ్రామం సోమలవాండ్లపల్లెలో శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని మద్దిరేవుల గ్రామం, సోమలవాండ్లపల్లికి చెందిన సోమల వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుంకర వెంకటరమణ కుమార్తె శివలీలను ఈనెల 15వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు మేజర్లు కావడంతో పెళ్లి అనంతరం అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును ఆశ్రయించి తమకు రక్షణ కల్పించాలని కోరారు. తమకు ప్రాణహాని ఉందని వెంకటేశ్వర్లు, శివలీల ఇరువురు కలిసి స్వగ్రామానికి రాకుండా రాయవరం వద్ద తెలిసిన మిత్రుల ఇంటిలో తలదాచుకున్నారు. అక్కడ ఉన్నట్లు సమాచారాన్ని సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు, బంధువులు ఇటీవల వారిపై దాడి చేశారు. స్థానికులు సుండుపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు యువతి, యువకుడిని సుండుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వారిరువురు స్వగ్రామానికి రాకుండా వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. దీంతో వారి సమాచారం తెలపాలని శనివారం అర్ధరాత్రి మూకుమ్మడిగా వెంకటేశ్వర్లు ఇంటిపై కర్రలు, ఇనుపరాడ్లతో అమ్మాయి కుటుంబ సభ్యులు దాడి చేసి తలుపులు, కిటికీలను ధ్వంసం చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న యువకుడి తల్లిదండ్రులను, వారి కుటుంబ సభ్యులను రోడ్డుపైకి ఈడ్చి చితకబాదారు. ఈ మేరకు బాధితులు లక్కిరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

సురభి కాలనీలో చోరీ

53 గ్రాముల బంగారం, రూ.97 వేల నగదు చోరీ


బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్న దృశ్యం

మదనపల్లె : పట్టణంలోని సురభి కాలనీలో శనివారం రాత్రి చోరీ జరిగింది. చోరీలో 53 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, 97 వేల రూపాయల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. స్థానికంగా నివాసం ఉన్న రామకృష్ణ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కలికిరి మండలం పాలమంద జాతరకు అత్త ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకోగా, అప్పటికే ఇంటి తలుపులు గడియ పగులగొట్టి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎరీషావలీ, ఎస్ఐ వెంకటశివకుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు. ఇటీవల బ్యాంకు నుంచి విడిపించిన 53 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, బీరువాలో ఉన్న రూ.97 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎరీషావలీ తెలిపారు.

బైకును ఢీకొన్న టిప్పర్

వ్యక్తికి తీవ్ర గాయాలు

రామాపురం : మండల పరిధిలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ పెట్రోల్ బంకు సమీపంలో బైకును టిప్పర్ ఢీ కొన్న సంఘటనలో జంపు మహేశ్వర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు చక్రాయపేట మండలం సురభి గ్రామం కుప్పగట్టపల్లెకు చెందిన జంపు మహేశ్వర్ కడప ఇండియన్ గ్యాస్ గోడౌన్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని చక్రాయపేటకు ఏపీ04 ఏడీ ఏపీ2207 బైకుపై గువ్వలచెరువు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మీదుగా ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో గువ్వలచెరువు పెట్రోల్ బంక్ సమీపానికి రాగానే ఎదురుగా కడప వైపు వెళ్తున్న ఏపీ04యూ1215ల టిప్పర్ ఢీ కొంది. ఈ సంఘటనలో బైకుపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ అమర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగులను మోసగిస్తున్న కూటమి సర్కార్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : ఉద్యోగులను మరోమారు మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని వైస్సార్‌సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి విజయభాస్కర్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రూ. 6200 కోట్ల ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తామంటూ మభ్యపెడుతోందన్నారు. ప్రభుత్వం చెల్లిస్తామంటున్న రూ.6200 కోట్లలో 85 శాతం నిధులు సీపీఎస్ ఉద్యోగుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. అలా చేయని పక్షంలో ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు వచ్చే ఆర్థిక సంవత్సరానికి అప్పుగా ఇచ్చే ప్రసక్తే ఉండదన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెడుతూ తామేమో ఉద్యోగుల బకాయిలను తీర్చేస్తున్నట్లు ఫోజులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జానం రవీంద్ర యాదవ్, సుగవాసి శ్యామ్‌కుమార్, సంజీవ, సాంబశివ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి దాష్టీకం

- చెల్లెలు పనికి రాలేదని అన్నపై దాడి
- మనస్థాపంతో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నం


మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శంకర

మదనపల్లె : తన ఇంట్లో పనికి రాలేదని, పనిమనిషి అన్నపై టీడీపీ నాయకుడు కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసి దాష్టీకానికి పాల్పడ్డాడు. మనస్థాపం చెందిన వ్యవసాయ కూలీ టీడీపీ నాయకుడి ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆదివారం రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన ఘటనపై బాధితుడు తెలిపిన మేరకు వివరాలు.. మదనపల్లె మండలం వేంపల్లి పంచాయతీ గుట్టకిందపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు శంకర (50) వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నాడు. అతని చెల్లెలు లక్ష్మీదేవి మదనపల్లె పట్టణంలోని కమ్మ వీధిలో నివాసం ఉంటున్న కొత్తపల్లె మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు బోయపాటి గోపాల్ రెడ్డి ఇంట్లో పని చేస్తుంది. ఆదివారం లక్ష్మీదేవి బంధువులకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆమె గోపాల్ రెడ్డి ఇంటికి పనికి వెళ్లలేదు. ఈ విషయమై గోపాల్ రెడ్డి శంకరకు ఫోన్ చేసి, మీ చెల్లెలు ఎందుకు పనికి రాలేదని ప్రశ్నించాడు. తమ కుటుంబ సభ్యులకు అనారోగ్యంగా ఉంటే కూడా మీకు పనికి రావాలా అంటూ శంకర అసహనం వ్యక్తం చేశాడు. దీంతో గోపాల్ రెడ్డి నీతో మాట్లాడే పని ఉంది ఇంటికి రమ్మని పిలిచాడు. సాయంత్రం శంకర గోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లగా, నన్ను ఫోన్లో నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావా అంటూ గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ తీవ్రంగా వైర్లతో కొట్టి దాడి చేశాడు. దీంతో మనస్థాపం చెందిన శంకర పురుగుమందు తీసుకొని వచ్చి గోపాల్ రెడ్డి ఇంటికి సమీపంలోనే తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వెంటనే తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్స అందించారు.

భక్తులతో కిక్కిరిసిన గంగమ్మ దేవత ఆలయం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మ తల్లి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గంగమ్మ తల్లికి వేలాది మంది భక్తులు ఆదివారం బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగిసిన తరువాత మూడవ ఆదివారం కావడంతో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలిరావడంతో అమ్మవారి దర్శనం కోసం వేకువ జాము నుంచే క్యూలైన్‌లో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. లక్కిరెడ్డిపల్లి పోలీసులతోపాటు ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆలయ పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ యాదవ్, రామచంద్ర, వెంకటేష్, గురుస్వామి , రెడ్డి శేఖర్, బోస్ యాదవ్, సాయిలు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించే విధంగా చొరవచూపుతూ అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రసాద్ యాదవ్, రవికుమార్, షఫీ, నాయక్, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ గేమ్స్ మీట్‌లో అనంతపురం విద్యార్థుల ప్రతిభ


ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంటున్న జేఎన్టీయూ అనంతపురం కళాశాల విద్యార్థులు

కలికిరి : కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన జేఎన్టీయూ యూనివర్సిటీ స్థాయి 12వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్-2025 ఆటల పోటీలలో జేఎన్టీయూ ఏ అనంతపురం విద్యార్థులు ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ దక్కించుకున్నారు. గేమ్స్ మీట్ ముగింపు సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. కలికిరి కళాశాలలో మొదటి సారిగా యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడంతో కళాశాలకు మంచి గుర్తింపు లభించిందన్నారు.

విజేతలు వీరే..

టేబుల్ టెన్నిస్ పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జేఎన్టీయూ ఏ అనంతపురం, బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తిరుపతి కేఎంఎం కళాశాల, బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో మదనపల్లి మిట్స్ కళాశాల విజేతలుగా నిలిచాయి. త్రోబాల్ మహిళల విభాగంలో మదనపల్లి మిట్స్, హ్యాండ్ బాల్ మహిళల విభాగంలో పులివెందుల జేఎన్టీయూ, వాలీబాల్ మహిళల విభాగంలో తిరుపతి ఎస్వీసీఈ కళాశాల, ఖోఖో పురుషుల విభాగంలో కలికిరి జేఎన్టీయూ, హ్యాండ్ బాల్ పురుషుల విభాగంలో పుత్తూరు సిద్ధార్థ కళాశాల, వాలీబాల్ పురుషుల విభాగంలో పుత్తూరు సిద్ధార్థ కళాశాల టీంలు విజేతలుగా నిలిచాయి. ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్‌ను 50 పాయింట్లతో జేఎన్టీయూ ఏ అనంతపురం కళాశాల సొంతం చేసుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, జేఎన్టీయూ అనంతపురం ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల పక్షపాతి వైఎస్సార్


మాట్లాడుతున్న పండుగోలు మణి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలోని దళిత, గిరిజనులకు భూములు పంపిణీ చేసిన దళిత, గిరిజన పక్షపాతి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని బీకేఎంయూ అధ్యక్షుడు పండుగోలు మణి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన వెంటనే దళిత గిరిజనులకు కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు మేరకు రెండు ఎకరాలు భూమి పంపిణీ చేశారని తెలిపారు. తరువాత ముఖ్యమంత్రులు ఎవరూ దళిత గిరిజనులకు భూమి పంపిణీ చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం పేదలకు ఒక్క సెంటు భూమి పంచిన పాపాన పోలేదన్నారు. ఎన్నికల ముందు పేదలు, కార్మికులకు హామీలు ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్ప, జ్యోతి చిన్నయ్య, చైతన్య, రాజశేఖర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన రామకృష్ణ

నిమ్మనపల్లె : చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. గంగాపురంపల్లెకు చెందిన రామకృష్ణ(52) స్థానికంగా చింతకాయలు కోసేందుకు కూలి పనులకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా, ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయమై చెవులు, ముక్కుల నుంచి రక్తంకారి అపస్మారక స్థితికి వెళ్లాడు. దీంతో గమనించిన స్థానికులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యచికిత్స అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

దూదేకుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటి అర్బన్ : జిల్లాలో దూదేకుల, నూర్‌బాషా కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు దూదేకుల రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పగడాల సిద్దయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని మాసాపేటలో జిల్లా నూర్‌బాషా, దూదేకుల సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో దూదేకులు, నూర్‌బాషాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఐక్యంగా పోరాటం చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.పకీర్‌సాహెబ్, పాలగిరి దర్బార్, కొండూరు మహమ్మద్ రఫీ, ఇనాయతుల్లా, జాఫర్, సిద్దయ్య, సుబ్బయ్య, నాగరాజు, షామీర్, సత్తార్, ప్రకాష్, లక్కిరెడ్డిపల్లె మహమ్మద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.